తైక్వాండో క్రీడాకారులకు పతకాలు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ఒరిస్సా రాష్ట్రం కటక్, జవహర్లాల్ ఇండోర్ స్టేడియంలో 9వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో ఛాంపియన్ షిప్ 2025 సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విజయనగరం టౌన్ కస్పా హైస్కూల్ గ్రౌండ్స్‌లో శిక్షణ పొందుతున్న ఎనిమిది మంది తైక్వాండో క్రీడాకారులకు రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం, ఐదు కాంస్య పతకాలు సాధించారు. వీరికి జిల్లా డీఎస్డీవో వెంకటేశ్వరరావు, జిల్లా సంఘ సభ్యులు పిల్లా శ్రీనివాస్, ఎస్.సతీష్ కుమార్, టి.మురళీకృష్ణ, తుంపాల వెంకటేష్ అభినందనలు తెలియజేశారు. విజేతలంతా గత కొన్నేళ్లగా తైక్వాండో శిక్షకులు డీవీ చారి వద్ద కస్పా హైస్కూల్లో శిక్షణ పొందతున్నారు.

ఆరోగ్యాంధ్ర సాధనే లక్ష్యం: మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - గంట్యాడ, నెల్లిమర్ల: ఆరోగ్యాంధ్ర సాధనే యోగాంధ్ర ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గంట్యాడ మండలంలో సోమవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా గంట్యాడ, నెల్లిమర్ల మండలాల్లో యోగా ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. యోగా గొప్పదనాన్ని వివరిస్తూ, ఆరోగ్య సాధనకోసం ప్రతీఒక్కరూ యోగా అలవర్చుకోవాలని ఈ సందర్భంగా గంట్యాడ లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపిడిఓలు, డిప్యుటీ ఎంపిడీఓలు, తాహసీల్దార్లు, వైద్యులు, వెలుగు, ఉపాధిహామీ, వైద్యారోగ్యశాఖ, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు. మండల స్థాయి యోగాంధ్ర పోటీలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. యువత, విద్యార్థులకు యోగా, వ్యాసరచన, చిత్రలేఖనం, పాటలు తదితర 15 రకాల పోటీలను నిర్వహిస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మయూరి జంక్షన్‌వద్ద ఎస్‌పి బంగ్లా రోడ్డులో కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆధ్వర్యంలో యోగా స్ట్రీట్ నిర్వహించారు. ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు యోగా గొప్పదనాన్ని, ప్రయోజనాలను వివరించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని శాఖా గ్రంథాలయ అధికారి సి.హెచ్.కృష్ణమూర్తి, నెమలం హైస్కూల్ టీచర్ కే.విస్సు తెలిపారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు చిత్ర లేఖనం, ఆటలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన యోగాంధ్ర

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని మండలంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం ముగిసిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.సూర్య నారాయణ అన్నారు. మంగళవారం నుండి గ్రామ సచివాలయం పరిధిలో సచివాలయ సిబ్బందిచే గ్రామస్తులకు యోగాంధ్ర శిక్షణ నేర్పించడం జరుగుతుందన్నారు. జూన్ 18వరకు యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పి.వెంకట్రావు, పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఏఈ ఆలీ, ఆయుష్ వైద్యాధికారి, పిహెచ్‌సి వైద్యాధికారి, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలు ద్వారా మంచి నడవడిక

విశాలాంధ్ర - శృంగవరపుకోట: నీతి కథలు వినడం ద్వారా మంచి నడవడిక వస్తుందని ఎల్.కోట జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పి.కాశీ విశ్వనాథం తెలిపారు.ఎస్.కోట గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో సోమవారం ఉపాధ్యాయులు కాశీవిశ్వనాథం పాల్గొని విద్యార్థులకు నీతి కథలు బోధించడం వారితో కథలు చెప్పించడం జరిగింది.అనంతరం విద్యార్థులు క్యారం బోర్డు,చదరంగం ఆటలు ఆడారు.ఈకార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఏటీఎం పి.నర్సు నాయుడు, డీన్ రఘు కుమార్, వాసు బాబు, తెలిపారు వీరిలో బి జయేంద్ర నాయుడు 437 ర్యాంక్, రాజ్ కిరణ్ 344 ర్యాంకు, పి.హేమ సాయి సూర్య కార్తీక్ ఓబీసీ 4 ర్యాంక్ వీరితోపాటు పదిమంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో ఉన్నత ప్రతిభ చాటారని తెలిపారు. వీరికి జోనల్ ప్రిన్సిపల్ శ్రీధర్, ప్రిన్సిపల్ ఆర్.శ్రీధర్ రావు, జోనల్ ఏవో మధు, ప్రిన్సిపల్ సిహెచ్ రాంబాబు, జి.సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు. శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ అందించినందుకు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

డి.ఆర్.ఓకి ఏఐఎస్ఎఫ్ వినతి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో డీఆర్ఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా జిల్లాలో సంక్షేమ వసతి గృహాలలో చదువుకునే విద్యార్థుల జీవితాలు మారట్లేదని వాపోయారు. ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్, కమాటి పోస్టులు భర్తీ చేయాలని, పెండింగ్లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని అన్నారు. రెండు హాస్టల్స్‌కు ఒకే వార్డెన్ ఇన్‌చార్జిగా ఉండటం వలన విద్యార్థికి ఏ సమస్య వచ్చినా వినేవారు లేరని వాపోయారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాలేజీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు లేని కారణంగా విద్యార్థుల అద్దె భవనాల్లో చాలీచాలని సదుపాయాలతో ఉంటూ చదువుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం గొప్పగా కోటి రూపాయలు కేటాయించి హాస్టల్ అభివృద్ధి పరుస్తున్నామని చెప్పే ప్రకటనలు ప్రకటనలుగానే మిగిలిపోతుంది తప్ప ఆచరణలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హాస్టల్ విద్యార్థులకు 100 రూపాయలకు మెస్ చార్జీలను పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్, ఉపాధ్యక్షులు ఎ.సుమన్.గణేష్ పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూ తగాదాలకు సంబంధించినవి 11, కుటుంబ కలహాలకు సంబంధించినవి 2, మోసాలకు పాల్పడినట్లు 2, ఇతర అంశాలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సమస్యలపై విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి సిఐ బి.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

భానుడు ప్రతాపం...నిర్మానుష్యంగా రహదారులు

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం మండలంలో గత రెండు రోజులు నుండి భానుడు ఉగ్ర రూపం దాల్చటంతో రోడ్లు అన్నీ నిర్మానుష్యంగా ఉండటంతో పాటు జన సంచారం అన్నది కానరాలేదు. అయితే సోమవారం ఉదయం ఆరు గంటలు నుండే భానుడు తీవ్ర రూపం దాల్చటంతో జనాలు ఇక్కట్లుకు గురయ్యారు. ఇటీవల నాలుగు రోజులు పాటు వర్షాలు కురవటం వాతావరణం చల్లబడిందని జనాలు భావించినప్పటికీ, గత రెండు రోజులు నుండి మాత్రం ఎండలు తీవ్రంగా ఉండటం ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. ఈ వర్షాలు వలన చెరువుల్లో నీరు చేరినప్పటికీ ప్రయోజనం శూన్యంగానే కనిపిస్తుంది. ఎందుకంటే వర్షం కురిసిన నాలుగు రోజులు మాత్రమే కాస్తా చల్లగా ఉన్నప్పటికీ, ఆదివారం నుండి మాత్రం భానుడు తీవ్ర రూపం దాల్చటంతో పాటు విద్యుత్ కోతలు వలన జనాలు ఉక్కపోత, దోమలు బెడద భరించలేక అల్లాడిపోతున్నారు. ఏది ఏమైనా గత రెండు రోజులు నుండి భానుడు ఉగ్రరూపం దాల్చటంతో వేడిమి భరించలేక జనాలు అల్లాడిపోతున్నారని చెప్పవచ్చు.

ప్రధాన రహదారిపై వరుస ప్రమాదాలు...

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి నుండి గరివిడి ప్రధాన రహదారిపై విజయ హాస్పటల్, నాయుడు ఫంక్షన్ హాల్ మధ్యలో గడిచిన మూడు నెలల్లో 6 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అదే మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్స్ చాలా చిన్నవిగా ఉండడం వలన వాహన చోదకులు చాలా స్పీడ్‌గా రావడంతో ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పెద్ద స్పీడ్ బ్రేకర్స్ వేసి ప్రమాదాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

సూపర్ సిక్స్ హామీలను అమలు పరచాలి ఎమ్మార్వో కార్యాలయాల వద్ద సీపీఐ నిరసన

విశాలాంధ్ర - బొబ్బిలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని, ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ బొబ్బిలి మండల పరిధిలో ఉన్న కృపవలస, దీవెన వలస, రామన్న వలస, సీయోను వలస, చిన్న అక్కెనవలస గ్రామాలను అందుబాటులో ఉండే పంచాయతీలో చేర్పించాలని, గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే లీజు పేరుతో గిరిజన భూములను కొనుగోలు చేస్తున్న వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండు దొర, సీపీఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు కే.సత్యనారాయణ, జి.తవుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సీపీఐ విజయనగరం నియోజవర్గ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డిడి సంతోషి కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రంగరాజు మాట్లాడుతూ పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, గతంలో లబ్ధిదారులతో దరఖాస్తులు నింపి ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అర్జీలు ఎమ్మార్వోకి అందజేసినా ఇంతవరకు కనీసం స్పందించకపోవడం అన్యాయం అన్నారు. పేదల పక్షాన ఆలోచన చేసి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇచ్చి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇచ్చి పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.నాగభూషణం, సీపీఐ నాయకులు బి.వాసు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ నెల్లిమర్ల తహశీల్దార్‌కు సీపీఐ, సీపీఎం నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు వినతి అందించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వం సుమారు 1400 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, ఇళ్ల నిర్మాణాల కోసం సామగ్రిని తీసుకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదని అన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా తుప్పలు నిండిపోయి ఉన్నందున ప్రభుత్వమే వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే వారికి వేరే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనకాల పద్మనాభం, లత, లక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలోని అర్హులైన నిరుపేదలందరికీ కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచిపోయాయని ఇంతవరకు ఒక్క సంక్షేమ పథకం అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. ఎన్నికలలో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం చంద్రబాబు నాయుడుకు కొత్తేమి కాదన్నారు. నరేంద్ర మోడీ ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన ఎంతోమంది ప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోములు, వానరాశి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాం నియోజవర్గ సీపీఐ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక్క పింఛన్లు పెంపుదల తప్ప ఈ సంవత్సర కాలంలో సూపర్ సిక్స్ పథకాలు ఏవి అమలు కాలేదు అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి సింగారపు కనకరాజు, జామి అప్పారావు, గుండెల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: కొత్తవలస మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్ళు మంజూరు చేయాలని సీపీఐ ఎస్.కోట నియోజకవర్గ కార్యదర్శి దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో సోమవారం కొత్తవలస మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ కొత్తవలస తహశీల్దార్ బి.నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేగల మాట్లాడుతూ గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంట్లు స్థలాలివ్వాలని, అలాగే ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరం: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని గజపతినగరం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఐ గజపతినగరం నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇళ్ల స్థలాలు పల్లెల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పనుల్లో 200 పని దినాలు ఇవ్వాలని, రోజుకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల రామునాయుడు, లంక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

పోస్టల్ శాఖకు కేటాయించిన భూమిని పరిశీలించిన జెసి

విశాలాంధ్ర - భోగాపురం: పోస్టల్ శాఖకు కేటాయించిన భూమిని జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. విమానాశ్రయం నిర్మాణం నేపథ్యంలో కార్గో సేవలతో పాటు భోగాపురం పోస్టల్ కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో భూమిని కేటాయించింది. ఈ భూమిని పోస్టల్ శాఖకు కేటాయిస్తున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. భూమికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ సురేష్, మండల సర్వేయర్ మధుకేశ్వరరావు జెసికి వివరించారు. డిప్యూటీ తాసిల్దార్ హరిన్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి బీచ్‌ను జేసీ పరిశీలన

విశాలాంధ్ర - పూసపాటిరేగ: చింతపల్లి సముద్ర తీరాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ సోమవారం పరిశీలించారు. పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న చింతపల్లి బీచ్‌లో మెగా యోగా ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమం కోసం ఆయన సముద్ర తీరాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, యోగా ప్రదర్శన స్థలం తదితర ప్రదేశాలను గుర్తించారు. అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. ఈ పర్యటనలో తహశీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ రాధిక, ఇతర అధికారులు పాల్గొన్నారు.

4న విద్రోహ దినంగా పాటించండి

వైసీపీ మండల అధ్యక్షుగు గొర్లె రవికుమార్

విశాలాంధ్ర-జామి: రాష్ట్రంలో ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు హామీలను పూర్తిగా గాలికి వదిలేసిందని మండల వైకాపా అధ్యక్షుడు గొర్లె రవికుమార్ ఆరోపించారు. సోమవారం జామిలోని తన స్వగృహంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేసిన ప్రజా మోసాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 4వ తేదీన విద్రోహదినంగా పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఈనిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ఎస్‌కోట నియోజకవర్గం పరదిలోని 13 పంచాయతీల నేతలు, కార్యకర్తలు ఎస్‌కోట వెళ్ళాలని, అలాగే గజపతినగరం నియోజకవర్గంలోని 12 పంచాయితీల నేతలు ,కార్యకర్తలు గజపతినగరం వెళ్ళాలని తెలిపారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను వెలంటనే అమలు చేయాలని డిమాండ్ చేసారు. అనంతరం విద్రోహదినంకు సంభందించిన గోడపత్రికలను విడుదల చేసారు. ఈకార్యక్రమంలో వైసీపీ నేతలు పొంద్రంకి సంజీవి, చలుమూరి సత్యారావు, జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి ఎస్.అరుణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, నెక్కలి రమణ, కిలారి సూర్యారావు, ఎన్నింటి శేషు, సూరిబాబు, సీరెడ్డిచంద్రునాయుడు, చుక్క రామకృష్ణ, పిన్నింటి రవికుమార్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలం బెల్లాం గ్రామం దగ్గరలో గల భాష్యం లే-అవుట్లో కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో డెంకాడ పోలీసు స్టేషను ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఆధ్వర్యంలోని పోలీసు సిబ్బంది, యాంటీ గంజాయి టీం దాడులు నిర్వహించింది. గంజాయి సేవిస్తూ, విక్రయాలకు పాల్పడుతున్న ఒక జువినల్‌తో సహా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. నిందితుల వద్ద నుండి 1.330 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రూ.200/-ల నగదును డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు సీజ్ చేసారని జిల్లా ఎస్పీ తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో (ఎ-1) జామి మండలం అలమండ గ్రామానికి చెందిన దాసరి గాంధీ (24), బెల్లాం గ్రామానికి చెందిన జుతిక శ్యామ్ (19), మల్లాపురెడ్డి రాకేష్, దిబ్బగుడ్డి గ్రామానికి చెందిన మల్లాపురెడ్డి వేణు ఉన్నారు. గంజాయి సేవించిన మరో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు.

సురక్షితంగా గ్యాంగ్ టక్ చేరుకున్న తహశీల్దార్ కుటుంబం

విశాలాంధ్ర - విజయనగరం: సిక్కిం పర్యటనలో వున్న తాను, తన కుటుంబం సురక్షితంగా రాజధాని గ్యాంగ్ టక్ నగరానికి సోమవారం మధ్యాహ్నం చేరుకున్నట్టు తహశీల్దార్ కూర్మనాధరావు ఫోన్ ద్వారా తెలిపారు. సిక్కింలోని లాఛోంగ్ నుంచి 130 కిలోమీటర్ల దూరంలోని గ్యాంగ్ టక్‌కు ఆర్మీ, అక్కడి పోలీసుల సహాయంతో చేరుకున్నట్టు వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఏ.పి.భవన్ ప్రత్యేక కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ సిక్కిం రాష్ట్ర అధికారులతో మాట్లాడి తన కుటుంబం తరలింపులో చొరవ చూపడంతో సురక్షితంగా చేరుకోగలిగామన్నారు. సి.ఎం.ఓ. ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తదితర అధికారులు తన కుటుంబం సురక్షితంగా చేరుకోవడంలో ఎంతో సహకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన చండీఘడ్ సమీపంలోని బాగ్డాస్ ఎయిర్‌పోర్టు మీదుగా విశాఖ చేరుకుంటామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర - విజయనగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక వినతి వచ్చింది. సదరు వినతిని స్వీకరించిన కమిషనర్ పల్లి నల్లనయ్య అందుకు సంబంధించిన సమస్య పరిష్కారానికి తగు చొరవ చూపాలని అధికారులు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ సంబంధించి వచ్చిన వినతిని అక్కడే ఉన్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తికి తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తున్నామని చెప్పారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో వంగర విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - వంగర: మండలంలో భాగింపేట గ్రామానికి చెందిన విద్యార్థికి ఐఐటీలో 486 ర్యాంక్ సాధించగా, జేఈఈ మెయిన్స్‌లో వంగర విద్యార్థి 386 ర్యాంక్ సాధించటం పట్ల గ్రామస్తులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాగింపేట గ్రామానికి చెందిన కటిక సిద్ధార్థ నాయుడు, పారిశర్ల భరద్వాజ్‌లు ఆలిండియా జనరల్ ర్యాంక్ 2183, ఆల్ ఇండియా ఓబీసీలో 386 ర్యాంక్ సాధించారు. భరద్వాజ్ తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా విశాఖలో ఉంటున్నారు. భరద్వాజ్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా శ్రీ గుండాలమ్మ పైడమ్మ పేరంటాలు శ్రీకృష్ణ స్వాముల విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గుండాలమ్మ పైడమ్మ పేరంటాలు, అలాగే శ్రీ కృష్ణ స్వామిల వారి ఆలయాలతో పాటు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పల నాయుడులు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ఆదివారం ఉదయం నుండి గణపతి పూజతో పాటు,పూజాధి కార్యక్రమాలు, అగ్ని ప్రతిష్ట హెూమాలు,కలిశా ప్రతిష్ట, జలాధివాసం, క్షీరాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన చేపట్టారు.''ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

పొదుపు సంఘం సభ్యులు ఆందోళన

విశాలాంధ్ర - రామభద్రపురం: తారాపురం గ్రామానికి చెందిన సాయిబాబా గ్రూపునకు చెందిన 11 మంది పొదుపు సంఘం సభ్యులు సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఎస్బిఐ ఖాతాదారుల సేవ కేంద్రం వద్ద జనవరి ఆరవ తేదీన తారాపురం గ్రామానికి చెందిన దుంప సింహాద్రి 33 వేల రూపాయలు పొదుపు డబ్బులు కట్టడానికని సేవ కేంద్రానికి వెళ్ళింది. నిర్వాహకుడు సత్య రావు పట్నాయక్‌కు సాయిబాబా గ్రూపు బ్యాంకు ఖాతాలో జమ చేయమని డబ్బులు అతని చేతికి ఇచ్చింది. డబ్బులు జమైనట్టు రసీదు ఇవ్వమని అడిగింది. రషీద్ అవసరం లేదు మీ యొక్క బ్యాంకు ఖాతాలో వేశాను వెళ్ళిపోమని చెప్పాడు. తర్వాత బ్యాంకు బుక్ ఆధారంగా స్టేట్మెంట్లో చూడగా ఆ నెలలో డబ్బులు జమ కాలేదు. డబ్బులు విషయం గత పది రోజుల నుంచి సేవా కేంద్రం వద్దకు వెళ్లి నిర్వాహకుడును ఎందుకు మా అకౌంట్లో జమ చేయ లేదని గ్రూప్ సభ్యులు ప్రశ్నించారు. ఆ డబ్బులకు నాకు ఎటువంటి సంబంధం లేదని నిర్వాహకుడు సత్యరావు మహిళలతో అన్నాడు. సభ్యులందరూ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో అతనిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ వెలమల ప్రసాదను వివరణ కోరగా ఫిర్యాదు అందడం నిజమే అని తెలిపారు. విచారణ జరిపి ఆయనపై చర్యలు చేపడతామని అన్నారు.

వీలుపర్తిలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామంలో జాతీయ అంధత్వ నివారణ సంస్థ విజయనగరం (మీమ్స్ ఆసుపత్రి) నెల్లిమర్ల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ శానాపతి లీల అప్పారావు సారథ్యంలో గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో 132 మంది రోగులు పాల్గొనగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 29 మంది కంటి వైద్య పరీక్షలు చేయగా 21మందిని కంటి ఆపరే షన్లకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే ఆర్థోపెటిక్ వైద్యానికి మరో 5 ఐదుగురు ఎంపికయ్యారన్నారు. అలాగే ఇతర ఆపరేషన్లకు మరో ముగ్గురు ఎంపిక చేసి వీరిని ఆపరేషన్ నిమిత్తం మిమ్స్ హాస్పటల్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో ఆప్థాలజీ సీనియర్ వైద్యులు బి.తనుజ, ఎల్.స్వాతి కంటి వైద్యనిపు ణులు, సీనియర్ వైద్యులు,కే.మౌనిక ఓబీజీ సీనియర్ వైద్యులు, కే లక్ష్మీ సునంద ఓబీజీ వైద్యులు, కె.భరద్వాజ్ జనరల్ వైద్య నిపుణులు, బి.సతీష్ కుమార్ జనరల్ సర్జన్ వైద్యులు, పి.సంజన జనరల్ మెడిసిన్ వైద్యులు, టెక్నీషియన్లు టి.నారాయణరావు, అశ్వం తిలు, పిఆర్వోలు ఎం.నాగభూషణరావు, జె.అప్పలనాయుడులు పాల్గొన్నారు.

మృతిచెందిన జనసేన కార్యకర్తల కుటుంబ సభ్యులకు నగదు అందజత

విశాలాంధ్ర-రాజాం.: రాష్ట్రంలో అనేక కారణాలతో ప్రమాదవశాత్తు మరణించిన 101 జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు చేతుల మీదగా 5 కోట్ల, 5 లక్షల రూపాయలు అందజేత. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలం, పొనుగుటివలస గ్రామం నుండి క్రియాశీల సభ్యత్వం తీసుకున్న జన సైనికుడు కీ"శే" కెంబూరు వైకుంఠరావు ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు మరణించారు. జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వాలు తీసుకున్న వారి కుటుంబానికి జనసేన పార్టీ తరవు నుంచి 5 లక్షల రూపాయలు చెక్కును ఆర్థిక భరోసా గా వైకుంఠరావు అమ్మ కళావతి,భార్య రాధాకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాజాం నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి పొగిరి సురేష్ బాబు, రాజాం నియోజకవర్గం జనసేన నాయకులు గార ఎర్రంనాయుడు, శెట్టి ఆదినాయుడు, లెంక అన్నంనాయుడు, మీసాల శ్రావణ్ కుమార్, పొగిరి శివ, వారాడ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ వినతుల ఆడిట్‌ను పూర్తిచేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు

వినతుల పరిష్కార వేదికకు 143 వినతులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రజా వినతుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందిన వినతులకు సత్వర పరిష్కారం చూపడంతో పాటు వాటిని అర్జీదారులు సంతృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులు పరిష్కారం చేసేటపుడు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని పద్ధతులను పాటిస్తూ వాటిని పరిష్కరిస్తున్నారా లేదా అనే అంశంపై వినతుల ఆడిట్ పూర్తిచేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందిన వినతుల పరిష్కారంపై కలెక్టర్ సోమవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతుల స్వీకరణ కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిఫారసు చేస్తామన్నారు.జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేదుమాధవన్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డి.ఆర్.ఓ. మురళీ, డిప్యూటీ కలెక్టర్‌లు సవరమ్మ, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీ తదితరులు వినతుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు వివిధ వర్గాల ప్రజల నుంచి 143 వినతులు అందాయి. రెవిన్యూ శాఖకు సంబంధించి 65, డి.ఆర్.డి.ఏ.కు 14, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖలకు 7 చొప్పున, పాఠశాల విద్యకు 5, ఆసుపత్రి సేవలకు సంబంధించి 4, ఇతర శాఖలకు సంబంధించి 35 వినతులు అందాయి. ఆయా వినతుల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్, జె.సి.లు అధికారులను ఆదేశించారు.

వైసీపీని బూత్ లెవెల్ నుండి బలోపేతం చేయాలి

వైసీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వైసీపీని బూత్ లెవెల్ నుండి బలోపేతం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శీను) అన్నారు. సోమవారం వైసీపీ విజయనగరం జిల్లా కేంద్ర కార్యాలయంలో జిల్లా పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల మండల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, మండల పరిధిలో పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి అంకిత భావంతో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుకుగా గ్రామస్థాయి నుండి పాల్గొనాలన్నారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ అనుబంధ విభాగ కమిటీలు నియోజకవర్గ సమన్వయకర్త అనుమతితో త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయిలో ఉన్న పార్టీ కమిటీలోని సభ్యులు చురుకుగా పార్టీ కార్యక్రమలో పాల్గొనే విధంగా భాధ్యత వహించాలన్నారు. మండల, గ్రామ స్థాయి పార్టీ పరిస్థితులు, సమస్యలు ఎప్పటికప్పుడు నియోజకవర్గ సమన్వయకర్తకి, జిల్లా పార్టీ అధ్యక్షులకు చెప్పాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నిరసన గళం వినిపిస్తూనే ఉంటుందని పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారని దీనిలో భాగంగా ఈనెల 4న జరిగే వెన్నుపోటు కార్యక్రమానికి 7 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలతో కలిసి నిరసనలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా కలిసి వచ్చేలా ఆయా జిల్లా మండల పార్టీ అధ్యక్షులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో జలకళ...

విశాలాంధ్ర - వేపాడ: ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రావడంతో వాతావరణం అనుకూలించి గత ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో వ్యవసాయ రైతుల అయకట్టు చెరువులు నిండడంతో జలకళగా మారాయి.ఈ మేరకు మండల వ్యవసాయ రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రతి ఏడాది ఖరీఫ్ పంటలకు ముందు వ్యవసాయ పొలాల్లో రైతులు అపరాలను పండించి వాటి ఆదాయంతో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతులు వేసే వరి నాట్లకు ఉపయోగపడేవని కానీ ఈ ఏడాది వర్షాలు ముందుగా రావడంతో నువ్వు చేలు, పెసర చేలు, తదితర అపరాల పంటలన్నీ పూర్తిగా వర్షాలకు నాశనం అయిపోయాయి. అలాగే ఖరీఫ్ వరి నారు ముందుగానే వేసుకునేందుకు ఈ మధ్యన కురిసిన భారీ వర్షాలకు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండడం వలన వరి నారుకు ఇబ్బంది లేకుండా ఉబాలాలకు సిద్ధమవ్వచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి గ్రామస్థాయి యోగా శిక్షణ

జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం,కంటోన్మెంట్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి యోగా శిక్షణా కార్యక్రమం మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని, దీనికి ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ సెల్ వద్ద అధికారులకు జెసి పలు సూచనలు చేశారు. ప్రతీ సచివాలయానికి 9 మంది యోగా శిక్షకులను ఎంపిక చేశామని, వీరి ద్వారా 3వ తేదీ నుంచి ఒక్కో బ్యాచ్‌కు 70 మంది చొప్పున 3 రోజుల యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. దీనికోసం ఎంపిక చేసి ప్రదేశాలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఐదు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న వారిని మాత్రమే యోగా శిక్షకులుగా ఎంపిక చేయడం జరిగిందని స్పష్టం చేశారు. ఇలా జూన్ 15 వరకు బ్యాచ్‌లు వారీగా శిక్షణా కార్యక్రమం జరుగుతుందని, గ్రామంలోని దాదాపు అందరికీ యోగా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో గ్రామస్థాయి యోగాంధ్ర పోటీలు పూర్తి అయ్యాయని జెసి తెలిపారు. కేవలం 20 గ్రామాలు నుంచి మాత్రమే పోటీల వివరాలు రావాల్సి ఉందన్నారు. ఈ రోజు నుంచి మండల స్థాయి పోటీలు ప్రారంభమవుతాయని, వివరాలను ఏరోజుకారోజు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌పై జెసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకముందు కూడా పెండింగ్ లేకుండా చూడాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. ప్రజలనుంచి వినతులను స్వీకరించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయ స్థాయిలో నిర్వహించే 1100 కాల్ సెంటర్ సేవలు ప్రారంభం కానున్నాయని జెసి తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలలో నారాయణ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలలో విశాఖపట్నం నారాయణ వసతి గృహంలో చదువుతున్న విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరీలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఉత్తరాంధ్ర డీన్ అండ్ డీజీఎం డి.హనుమంతరావు, ఏజీఎం విశ్వేశ్వరరావు తెలిపారు. వీరిలో టి.మనోహర్ ఓపెన్ క్యాటగిరి ర్యాంక్ 116, క్యాటగిరి ర్యాంక్ 15, పిటి ఆనంద్ చక్రవర్తి ఓపెన్ కేటగిరీ ర్యాంక్ 118, కేటగిరి ర్యాంక్ 17, ఏ.సాత్విక్ ఓపెన్ క్యాటగిరి ర్యాంక్ 278, క్యాటగిరి ర్యాంక్ 39, పి.కార్తీక్ ఓపెన్ క్యాటగిరి ర్యాంక్ 419, కె.వి అరవింద్ కుమార్ ఓపెన్ క్యాటగిరి 442, డి.మహిత్ ఓపెన్ క్యాటగిరి 551 క్యాటగిరి ర్యాంక్ 79, బి.ఈశ్వర తనూజ్ ఓపెన్ క్యాటగిరి 617 క్యాటగిరి ర్యాంక్ 94, పి.శ్రీ హర్షవర్ధన్ ఓపెన్ క్యాటగిరి 635 కేటగిరీ ర్యాంక్ 99 వీరితోపాటు సుమారు 23 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు తెలిపారు. ఇటువంటి విజయాన్ని అందించిన కళాశాల ప్రిన్సిపాల్‌లకు, సిబ్బందికి, తల్లిదండ్రులకు, అభినందనలు తెలుపుతున్నామన్నారు.

నిరంతరం నారాయణ కళాశాలలో ఉన్నత విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే నారాయణ కళాశాలలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.

యువకుడి విజయం

ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అఖిల భారత స్థాయి ఘనత

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జిల్లాలో నివాసం ఉంటున్న సాయి ప్రియతమ్ ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో దేశవ్యాప్తంగా 15 లక్షల మంది విద్యార్థులతో పోటీపడి, ఓపెన్ కేటగిరీలో 1081వ ర్యాంక్, కేటగిరీ ర్యాంక్‌లో 178వ స్థానం సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడు. విశాఖపట్నంలోని నారాయణ జూనియర్ కళాశాల నుంచి ఈ పరీక్ష రాసిన ప్రియతమ్, తన అవిశ్రాంత కృషి, అంకితభావం, దృఢమైన సంకల్పంతో ఈ అద్భుత విజయాన్ని అందుకున్నాడు. గ్రామీణ నేపథ్యం, పరిమిత వనరుల మధ్యలోనూ కఠిన శ్రమ, క్రమశిక్షణ, సమయ పాలనతో అతను ఈ ఘనత సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచాడు.

కుటుంబం నుంచి బలమైన ప్రోత్సాహం

ప్రియతమ్ తండ్రి ఎల్.వి. యుగంధర్, విజయనగరం జిల్లా ఖజానా కార్యాలయంలో ట్రెజరీ డిపార్ట్మెంట్‌లో సీనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి శ్రీవాణి గృహిణి. తల్లిదండ్రులు తమ కుమారునికి నిరంతరం ధైర్యం, మద్దతు అందించి అతని విజయంలో కీలక పాత్ర పోషించారు.

వెన్నుపోటు దినం గోడ పత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరంలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం గోడ పత్రికను జడ్పిటిసి గార తవుడు పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించినందున పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 4వ తేదీన నిరసన కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ నిరసన ప్రజలను చైతన్యవంతులను చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బెల్లాన త్రినాధరావు, కరణం ఆదినారాయణ, కే పైడిపురాయుడు, కర్రీ రాము నాయుడు, నానాజీ, ఆల్తి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తున్న పశువులు పట్టివేత

విశాలాంధ్ర - గజపతినగరం: పశువులను అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు బొండపల్లి ఎస్సై యు.మహేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. వాహనాలు తనిఖీల్లో భాగంగా బొబ్బిలి నుండి కేరళకు వాహనాలలో 32 పశువులను తీసుకొని వెళుతుండగా సిబ్బంది సహకారంతో పట్టుకున్నట్లు అన్నారు. ఈ మేరకు పశువులను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

నేడు శ్రీ దుర్గాలమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని వావిలపాడు పంచాయతీ శివారు కడకండ గ్రామంలో మంగళవారం శ్రీ దుర్గాలమ్మ తల్లి పండగ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని గ్రామ పెద్దలు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం నుండి అమ్మవారికి దీప ధూప నైవేద్యలతో పాటు మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. అలాగే సాయంత్రం 6 గంటల నుండి అమ్మవారి ఘటాలతో గ్రామంలో ఊరేగింపు చేసి పండుగ అనుపోత్సవం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం రాత్రి 9 గంటల నుండి శివలక్ష్మీ ఈవెంట్ విశాఖపట్నం వారిచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం పదు రమ్యంగా నిర్వహించబడునని గ్రామ పెద్దలు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు.

పంచాయితీ కార్యదర్శులకు బదిలీల కౌన్సిలింగ్

విశాలాంధ్ర - విజయనగరం: జిల్లాలో పలువురు పంచాయితీ కార్యదర్శులు బదిలీ కానున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పంచాయితీ కార్యదర్శులకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనల మేరకు గ్రేడ్ 3 పంచాయితీ కార్యదర్శులు 18 మంది, గ్రేడ్ 4 కార్యదర్శులు 61 మంది, గ్రేడ్ 5 కార్యదర్శులు 116 మంది బదిలీకి అర్హులుగా నిర్ణయించి, వీరికి కౌన్సిలింగ్ పూర్తి చేశారు. అదేవిధంగా ముగ్గురు డిప్యూటీ ఎంపిడిఓలు (ఈఓపిఆర్‌డిలు) కూడా బదిలీ కానున్నారు. వీరందరికీ డిఆర్ఓ మురళి, జిల్లా పంచాయితీ అధికారి టి.వెంకటేశ్వర్రావు కౌన్సింగ్ నిర్వహించి, కొత్త ప్రాంతాలను కేటాయించారు. పంచాయితీ శాఖ అధికారులు, సిబ్బంది సహకరించారు.

ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగు ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎ.పి.యస్.ఆర్.టి.సి. అవుట్‌సోర్సింగ్ అసోసియేషన్ స్టేట్ వర్కింగ్ సెక్రటరీ ఏ.అశోక్ మాట్లాడుతూ ఆర్టీసీ కాంట్రాక్టు 7300 మంది కార్మికులు కాంట్రాక్ట్ వ్యవస్థ థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నామని థర్డ్ పార్టీ విధానం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఆర్టీసీలో థర్డ్‌పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, రఘు, ఈశ్వరరావు నర్సియమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్స్ వేయండి... ప్రమాదాలను నివారించండి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: స్థానిక 42 డివిజన్ పరిధిలో ఉన్న కామాక్షి నగర్ శ్రీ చైతన్య స్కూల్ వద్ద, అయ్యన్నపేట జంక్షన్ వద్ద తరుచుగా వాహనాల ప్రమాదాలతో ప్రజలంతా తీవ్ర గాయాలతోను, కొన్నిసార్లు మరణాలతోను చాలా ఇబ్బందులపాలు అవుతున్నారని, తక్షణమే స్పీడ్ బ్రేకర్స్ వేసి ప్రమాదాలను అరికట్టాలని సోమవారం ఉదయం ప్రజా వినతులు పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు(బాలు), జనసేన పార్టీ సీనియర్ నాయకులు పిడుగు సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా త్యాడ రామకృష్ణారావు(బాలు) మాట్లాడుతూ గతంలో రోడ్లు, భవనాల శాఖ వారికి జాతీయ రహదారుల శాఖ వారికి, జిల్లా కలెక్టర్ వారికి అయ్యన్నపేట జంక్షన్ వద్ద, చైతన్య స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ వేయించమని పలుమార్లు వినతి పత్రములు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇకనైనా జాతీయ రహదారులు శాఖ వారు పట్టించుకొని స్పీడ్ బ్రేకర్లు వేయాలని లేదంటే ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని స్పీడ్ బ్రేకర్లు వేసేవరకు పోరాటం తప్పదని అన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - విజయనగరం: యోగా ద్వారా శారీరకంగా మానసికంగా ఏకీకృతం చేసి వసుదైక ఆరోగ్య కుటుంబాన్ని ఏర్పాటు చేసేందుకు యోగాంధ్ర 2025 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. సోమవారం స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద యోగాసనాలను నిర్వహించారు.

అనంతరం మయూరి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగ ప్రొఫెసర్ ఇందుమతి యోగాసనాల ఆవశ్యకతను వివరిస్తూ అందరూ యోగా ప్రక్రియలు చేపట్టే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు యోగాసనాలు నిర్వహించడమే కాకుండా యోగ పట్ల ప్రతి ఒక్కరిని చైతన్యవంతులను చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, క్రీడాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.